సాక్షి
ప్రకాశం

బుధవారం । 16 । జూలై । 2025



సి'ఫార్సు' బదిలీ..వీఏఏలు బలి

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో మితిమీరిన రాజకీయ జోక్యంతో వారు అవస్థలు పడుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సులతో రెండుసార్లు బదిలీ జాబితాలు ఇచ్చారు - 8లో..



బాబు మోసాలు బయటపెడదాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను బయటపెడదామని మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఏడుగురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల సస్పెన్షన్

మార్కాపురం: పార్టీ ఆదేశాలను ధిక్కరించి మున్సిపల్ చైర్మన్‌పై జరిగిన అవిశ్వాస తీర్మానంలో ఓటింగ్‌లో పాల్గొన్న ఏడుగురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ప్రకటన జారీ చేసింది. గత నెల 11వ తేదీన మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణపై టీడీపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించగా ఏడుగురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పార్టీ విప్‌ను ధిక్కరించి అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించడంతో వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. 17వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, 24వ వార్డు కౌన్సిలర్ బుసెట్టి నాగేశ్వరరావు, 19వ వార్డు కౌన్సిలర్ టీ.రంగలక్ష్మమ్మ, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ ఖుర్షీద్ బి, 10వ వార్డు కౌన్సిలర్ ఏలూరు జ్యోతి, 12వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫాతిమా, 14వ వార్డు కౌన్సిలర్ బుర్రి ఎల్లమ్మను సస్పెండ్ చేశారు.

నైపుణ్యాభివృద్ధిలో యువత ముందుండాలి



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారిణి

ఒంగోలు సిటీ: పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ప్రత్యక్షంగా కానీ, ఆన్‌లైన్ ద్వారా కానీ ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారిణి రమాదేవి పేర్కొన్నారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జనశిక్షణ సంస్థ, ఐటీఐ కళాశాల, జిల్లా యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధిలో యువత ముందుండాలని అదే సమయంలో క్రమశిక్షణ, అంకితభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, సెట్టిప్ సీఈఓ శ్రీమన్నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు, జనశిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'నెత్తురు నది'కి నాగభైరవ సాహిత్య పీఠ పురస్కారం

ఒంగోలు మెట్రో:

జాతీయ కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట నాగభైరవ సాహిత్య పీఠం ఏటా ఇచ్చే అనువాద సాహిత్యంపై పురస్కార ప్రదానం కోసం పుస్తకాలను ఆహ్వానించింది. వచ్చిన పుస్తకాలను పరిశీలించి న్యాయనిర్ణేతల అభిప్రాయం మేరకు రూ.10 వేల ప్రథమ బహుమతికి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి రచించిన 'నెత్తురు నది' నవలను, రూ.5 వేల ద్వితీయ బహుమతికి కోనేరు కల్పన రచించిన 'దర్పణం' కథా సంపుటిని ఎంపిక చేసినట్లు సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17వ తేదీ ఆదివారం ఉదయం జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నిందితుడికి 80 రోజుల జైలు

- మరో ఇద్దరికి 30 రోజులు, ఇంకొకరికి 15 రోజుల శిక్ష..
- రూ.10 వేల చొప్పున జరిమానా కూడా..

గిద్దలూరు రూరల్/కంభం/బేస్తవారిపేట:

పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్ వద్ద మద్యం మత్తులో, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి 80 రోజుల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ మంగళవారం గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర తీర్పు వెల్లడించినట్లు సీఐ కె.సురేష్ తెలిపారు.

కంభం పరిధిలో మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు 30 రోజుల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తీర్పు వెల్లడించినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు.

బేస్తవారిపేట మండల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిని మంగళవారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.భరత్‌చంద్ర తీర్పు వెల్లడించినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. ఒకరికి రూ.10 వేల జరిమానా, 15 రోజుల జైలు శిక్ష, మరొకరికి రూ.10 వేలు జరిమానా, 30 రోజుల జైలు శిక్ష విధించారని వివరించారు.

చౌక నిర్ణయం.. కందికి ఎగనామం!

రేషన్ కార్డుదారులకు కందిపప్పు దూరమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అరకొరగా ఇస్తూ వచ్చింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి రేషన్ షాపులకు పంపిణీని నిలిపేసింది. బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక సామాన్య, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు 655 టన్నులు అవసరమవుతుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కందిపప్పు ధరలు భారీగా పెరిగినప్పుడు కార్డుదారులకు చౌకధరల దుకాణంలో తక్కువ ధరకే అందిస్తూ అండగా నిలిచింది. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

- రేషన్ దుకాణాల్లో కందిపప్పునకు మంగళం పాడేసిన కూటమి సర్కార్
- ఏడు నెలలుగా పంపిణీ నిలిపివేత
- బియ్యం, పంచదారకే పరిమితం
- డీలర్లకు డీడీలు తీయొద్దంటూ అధికారుల సూచన
- జిల్లా వ్యాప్తంగా 655 టన్నుల పప్పు అవసరం
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనలేక ఇబ్బందులు



జిల్లాలో రేషన్‌కార్డులు	6,61,206
కార్డుల్లోని సభ్యులు	19,37,977
రేషన్ దుకాణాలు	1,392

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం నిత్యావసర వస్తువుల పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. అధికారంలోకి వచ్చీ రాగానే అధికార టీడీపీ నేతలు రేషన్ దుకాణాలపై కన్నేశారు. దశాబ్దాలుగా రేషన్ దుకాణాలనే నమ్ముకుని ఉన్నవారిని తొలగించేందుకు కుట్రలకు తెరతీశారు. చాలా మందిపై బెదిరింపులకు దిగారు. అధికారులతో దాడులు చేయించారు. జిల్లాలో తమ మాట వినని దుకాణాలపై పదుల సార్లు అధికారులతో దాడులు చేయించారంటే ఎంతకు తెగించారో అన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1392 రేషన్ దుకాణాలు ఉండగా అందులో 1000 మందికి పైగా డీలర్లను తమకు అనుకూలమైన వారిని పెట్టుకుని బియ్యం దందాకు తెరతీశారు. ఇక కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్ సీపీ ఇంటి ముంగిటకే ప్రజా పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చింది. ఎండీయూ వాహనాలతో నాలుగేళ్లుగా రేషన్ పంపిణీ చేస్తూ లబ్ధిదారులకు అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీల నేతలు రేషన్ పంపిణీ వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకుని బియ్యం దందాకు తెరతీశారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసి రేషన్ దుకాణాలకు వెళ్లి అవస్థలు పడుతూ నిత్యావసరాలు తీసుకునే దుస్థితి కల్పించింది. ఇదిలా ఉంటే ప్రజలకు అత్యవసరమైన కందిపప్పు సరఫరాకు మంగళం పాడేసింది. జిల్లాలో మొత్తం ప్రభుత్వ రేషన్ దుకాణాలు 1,392, రేషన్‌కార్డులు 6,61,206 ఉన్నాయి. నెలనెలా కందిపప్పు లబ్ధిదారులకు సరఫరా చేయాలంటే సుమారు 655 టన్నులు అవసరమవుతుంది. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి మూడు నెలలు అరకొరగా కందిపప్పు సరఫరా చేస్తూ వచ్చింది. లబ్ధిదారుల్లో సగం మందికి అందేది కాదు. ఇక రాను రాను పంపిణీని నిలిపేసింది. వచ్చే నెలలో పంపిణీ చేస్తామంటూ పౌరసరఫరాల శాఖ అధికారులు ఏ నెలకానెల చెబుతూ వస్తున్నారు. ప్రతి నెలా కార్డుదారులకు నిరాశ తప్పడంలేదు. ఈనెల కూడా కందిపప్పు రాలేదని డీలర్లు చెబుతుండటంతో చేసేది లేక ఇచ్చిన బియ్యం తీసుకుని వారు వెనుతిరుగుతున్నారు. కొన్ని నెలల క్రితం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180 వరకూ పలికింది. ఈ ధర కొన్ని నెలలపాటు కొనసాగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమయంలో సబ్సిడీ ధరకు కందిపప్పు సరఫరా చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చెతులెత్తేసింది. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కిలో రూ.130 ఉంది. రేటు ఎక్కువగా ఉన్నప్పుడు సబ్సిడీపై ఇవ్వలేని ప్రభుత్వం, కనీసం ధర తక్కువగా ఉన్నప్పుడైనా ప్రజలకు అందించేందుకు ముందుకు రావడంలేదు. కూటమి ప్రభుత్వం వస్తుంది మీ కష్టాలు తీరుస్తుంది అని ఊదరగొట్టిన పాలకులు పేద ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకపోగా, చివరికి కందిపప్పు కూడా కార్డుదారులకు పంపిణీ చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీడీలు తీయని డీలర్లు...

రేషన్ డీలర్లు ప్రతి నెలా 20వ తేదీ లోపు డీడీలు తీసి, తమ పరిధిలోని కార్డుదారులకు అవసరమైన బియ్యం, కందిపప్పు, పంచదార వంటి సరుకులు దిగుమతి చేసుకుంటారు. కొన్ని నెలలుగా డీలర్లు డీడీలు తీస్తున్నా పౌర సరఫరాల శాఖ మాత్రం అవసరమైన మేరకు కందిపప్పు సరఫరా చేయడం లేదు. ప్రస్తుతం కందిపప్పు కోసం డీడీలు తీయవద్దని డీలర్లకు ముందుగానే అధికారులు సమాచారం ఇస్తున్నారు. దీంతో వారు డీడీలు కట్టడం మానేశారు. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు కావాలని కార్డుదారులు అడుగుతుంటే తమకే రాలేదని డీలర్లు బదులిస్తున్నారు.

పెరిగిన ధరలతో అవస్థలు..

నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజలు జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఆయిల్, కందిపప్పు ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలు చేయడం తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

కందిపప్పు ఇవ్వడం పూర్తిగా నిలిపేశారు



నెలల తరబడి కందిపప్పు ఇవ్వడంలేదు. రేషన్ దుకాణాల్లో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదట్లో అరకొరగా పంపిణీ చేశారు. ఇప్పుడు పూర్తి గా నిలిపేశారు. పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ప్రభుత్వం ప్రతి నెలా సబ్సిడీపై కందిపప్పు సరఫరా చేయాలి.
– ముమ్మడి లక్ష్మీదేవి, బేస్తవారిపేట.

కందిపప్పును సబ్సిడీపై ఇవ్వాలి



చౌక దుకాణాల రేషన్ కోసం వెళితే బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై కేజీ కందిపప్పును రూ.65కు మాత్రమే అందించారు. కూటమి ప్రభుత్వం పేదలపై దయ చూపించడం లేదు. ఇప్పుడు చౌక దుకాణంలో కందిపప్పు లభించక బయట కేజీ రూ.165 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. పేదలపై కూటమి ప్రభుత్వం దయచూపి చౌక దుకాణాల్లో కందిపప్పును సబ్సిడీపై ఇవ్వాలి.
– ఇనకొల్లు, శ్రీనివాసరావు

మూడు రోజులే సరుకులిచ్చి రేషన్ దుకాణాలు మూసేస్తున్నారు



మండలంలో 24 రేషన్ దుకాణాలున్నాయి. ఏ రేషన్ దుకాణాల్లోనూ కందిపప్పు ఇవ్వలేదు. కార్డుదారులకు కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో నిత్యవసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా ఉంది. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాల్సి ఉండగా, రెండు మూడు రోజులు మాత్రమే సరుకులు ఇచ్చి దుకాణాలు మూసేస్తున్నారు.
– బొల్లినేని నాగేశ్వరరావు, రావెళ్లవారిపాలెం, కొండపి నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు

డీలర్లు కందిపప్పు రాలేదంటున్నారు



ఇంటింటికీ రేషన్ వ్యవస్థను తొలగించారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేస్తే ఎంతో కొంత ఉపయోగకరంగా ఉంటుంది. కార్డుదారులు ప్రతినెలా కందిపప్పు వచ్చిందా అని డీలర్లను అడిగితే రాలేదంటున్నారు. – షేక్ అన్వర్ బాషా, కంభం.

ముప్పాకు హైకోర్టులో చుక్కెదురు

- ముందస్తు బెయిల్ తిరస్కరించిన హైకోర్టు
- వీరయ్య చౌదరి హత్యకేసులో ముప్పా సురేష్‌కు సంబంధం
- కేసు నమోదు చేసిన పోలీసులు
- ముందస్తు బెయిల్ కోసం ముప్పా యత్నాలు
- వీరయ్య హత్య కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని ప్రాసిక్యూషన్ వాదన
- పోలీసులు నోటీసులిచ్చినా విచారణకు హాజరుకాని ముప్పా భార్య

ఒంగోలు టౌన్: టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ముందస్తు బెయిల్ కోసం నిందితుడు ముప్పా సురేష్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ప్రభుత్వ న్యాయవాది లక్ష్మీ నారాయణ వాదనలు వినిపించగా నిందితుడు సురేష్ తరఫున హైకోర్టు న్యాయవాది పృథ్విరాజు వాదించారు. అలాగే మృతుడు వీరయ్య చౌదరి భార్య తరఫున హైకోర్టు న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. ముందస్తు బెయిల్‌పై మే నెల నుంచి వాయిదాలు పడుతూ వచ్చింది. చివరికి ఈ నెల 11వ తేదీ హైకోర్టులో వాదనలు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీ ఒంగోలులోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న తన కార్యాలయంలో వీరయ్య చౌదరి దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసు దర్యాప్తు దశలో ఉందని, ఈ హత్యతో ముప్పా సురేష్‌కు సంబంధం ఉందని ప్రాథమిక ఆధారాలున్నాయని ప్రాసిక్యూషన్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. సురేష్‌కు చెందిన కంపెనీ డైరక్టర్ ఖాతా నుంచి ప్రధాన ముద్దాయి బోర్లగుంట వినోద్‌కు నగదు బదిలీ జరిగినట్లు ఆధారాలు ఉన్నాయని, కేసు దర్యాప్తు వేగవంతంగా జరుగుతున్న దశలో నిందితుడికి బెయిల్ మంజూరైతే దర్యాప్తునకు అవరోధాలు కలిగే అవకాశం ఉంటుందని బలంగా వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ వాదనల్లో అంశాలను పరిశీలించిన హైకోర్టు ఆయన వాదనలతో ఏకీభవించి ముందస్తు బెయిల్‌ను తిరస్కరించినట్లు కేసు దర్యాప్తు అధికారి, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు.

మూడు నెలలుగా పరారీలోనే ముప్పా...

టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య జరిగిన రోజు నుంచి ముప్పా సురేష్ పరారీలో ఉన్నారు. హతుడు వీరయ్య చౌదరి, నిందితుడు ముప్పా సురేష్ ఇద్దరూ అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వారే కాకుండా టీడీపీ నాయకులుగా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ రాజకీయాల్లో ఆధిపత్యం కొనసాగించే విషయంలో సురేష్‌తో పాటుగా దేవేంద్ర చౌదరితో వీరయ్య చౌదరికి విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వీరయ్యను కడతేర్చేందుకు సురేష్ బృందం పథక రచన చేసిందని, పక్కా ప్రణాళికతో హత్య చేసిందని పోలీసులు ప్రకటించడం తెలిసిందే. అసలు హైదరాబాద్‌లోని ముప్పా సురేష్ నివాసంలోనే ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలోనే వీరయ్య చౌదరి హత్యకు పథక రచన చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇదిలా ఉండగా వీరయ్య హత్య జరిగిన తరువాత నుంచి పరారీలో ఉన్న ముప్పా ఈ హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని వాదిస్తూ వచ్చారు. అప్పటి నుంచి అజ్ఞాతంలోనే ఉన్న ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. మే నెల నుంచి ఈ కేసు వాయిదాల మీద వాయిదా పడుతూ వచ్చింది. చివరికి వాదోపవాదనలు విన్న హైకోర్టు ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది. దీంతో ఇప్పుడేం జరుగుతుందన్న ఉత్కంఠ నెలకొంది. బెయిల్ రాకపోతే పోలీసుల ఎదుట హాజరుకావాలని ముప్పా సురేష్ భావిస్తున్నట్లు సమాచారం. బెయిల్ కోసం సుప్రీం కోర్టు తలుపు తట్టాలని ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఎన్నికల కమిషనర్‌గా పని చేసిన ఒక ఐఏఎస్‌తో ముప్పాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆయన సహకారంతోనే ఇన్నాళ్లుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడని ప్రచారం జరుగుతోంది.

పోలీసుల విచారణకు హాజరుకాని ముప్పా భార్య

వీరయ్య చౌదరి హత్య కేసులో విచారణ సందర్భంగా పోలీసులకు కీలక సమాచారం లభ్యమైంది. ఈ హత్య కేసులో అరెస్టయి జైలులో ఉన్న నిందితులను మే 24వ తేదీ పోలీసు కస్టడీకి తీసుకొని విచారించారు. హైదరాబాద్‌లోని ముప్పా సురేష్ నివాసంలో వీరయ్య చౌదరిని హత్య చేయాలని సురేష్, ఆళ్ల సాంబయ్య, వినోద్ మాట్లాడుకున్నారని, ఆ సమయంలో సురేష్ భార్య కూడా అక్కడే ఉన్నట్లు నిందితులు చెప్పినట్లు పోలీసులు ప్రకటించడం తెలిసిందే. ఈ క్రమంలోనే జూలై 5వ తేదీ ముప్పా సురేష్ భార్యకు పోలీసులు బీఎన్ఎస్ఎస్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన పోలీసులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నోటీసులు ఇచ్చి 10 రోజులైనా ఆమె పోలీసు విచారణకు హాజరుకాలేదు.

గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: గిరిజన ఆవాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు త్వరగా కల్పించడంపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. పీ.ఎం-జన్‌మన్, డీ.ఏ- జె.జి.యు.ఏ. పథకాల్లో భాగంగా చేపట్టిన కార్యక్రమాల్లో పురోగతిపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన ఆవాసాల్లో, ప్రత్యేకించి ఐటీడీఏ పరిధిలో ఉన్న పశ్చిమ ప్రాంత ప్రజలకు మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరచాల్సి ఉందన్నారు. గృహ నిర్మాణాల్లో ప్రతి వారం స్పష్టమైన పురోగతి ఉండాలన్నారు. గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంతోపాటు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. బిల్లులను ప్రభుత్వం త్వరగా చెల్లిస్తున్నందున లబ్ధిదారులందరూ వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ఆవాస గ్రామాలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, వంట గ్యాస్ కనెక్షన్లు, టెలిఫోన్ టవర్ల నిర్మాణం, మొబైల్ మెడికల్ యూనిట్ల సేవలు అందేలా శాఖల వారీగా, సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. సాంకేతిక సమస్యలు ఏమైనా తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర్రావు, డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వరరావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి రవితేజ, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ పద్మశ్రీ, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, మత్స్యశాఖ జే.డీ.శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రవికుమార్, వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, రోడ్లు భవనాలు, టెలికాం శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ వాలిడేషన్ బిల్లు రద్దు చేయాలి

- పెన్షనర్ల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం
- కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ఒంగోలు సబర్బన్: కేంద్ర ఆర్థిక బిల్లులో చొప్పించిన పెన్షన్ వాలిడేషన్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ఆల్ ఇండియా, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు తరలి వచ్చి ధర్నాలో పాల్గొన్నారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు బి.అంకిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెన్షనర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. 1972 నుంచి ఉన్న పెన్షన్ చట్టాన్ని మార్చి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను విస్మరించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ దయాధర్మ భిక్షం కాదని, ఇది ఉద్యోగుల హక్కు అని సుప్రీం కోర్టు పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ బిల్లుతో 50 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. భవిష్యత్‌లో పే కమిషన్ సిఫార్సులు పాత పెన్షనర్లకు వర్తించకుండా చేయడానికి కేంద్రం కుట్ర పన్నిందని ఆరోపించారు. తరువాత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే పద్ధతిని అవలంబిస్తాయని మండిపడ్డారు. కేంద్ర ఆర్థిక బిల్లులో భాగంగా మార్చి 25న లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా, మార్చి 29న రాష్ట్రపతి ఆమోదముద్ర వేసినట్లు తెలిపారు. ఇది చట్టమైతే సీనియర్ పెన్షనర్లకు పెన్షన్ అప్‌డేషన్ గాలిలో కలిసిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ లాంటి సందర్భాల్లో కేంద్రం మూడు డీఏల చెల్లింపులను నిలిపేసిందని, రాష్ట్రాలు కూడా అదే బాట పట్టాయని మండిపడ్డారు. తక్షణమే కేంద్రం 8వ పీఆర్సీ, రాష్ట్రానికి 12వ పీఆర్సీ నియమించి అమలయ్యే వరకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బీ అంకిరెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.రామ్మోహన్ రావు మాట్లాడుతూ పెన్షన్ బిల్లును ఉపసంహరించకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అసోసియేషన్ నాయకులు పరిటాల సుబ్బారావు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కంభం యూనిట్ అధ్యక్షుడు ఎం.డి.ఇబ్రహీం, పొదిలి యూనిట్ ఉపాధ్యక్షుడు ఏ.బాదుల్లా, ఏపీటీ ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు ఎం కృష్ణయ్య, మర్రి లక్ష్మీనారాయణ, నేలటూరి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు.

అర్హులకు ఇంటి నివేశన స్థలం

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: రానున్న మూడేళ్లలో జిల్లాలో ఇల్లు లేని వారు ఉండరాదన్న లక్ష్యంతో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ తహశీల్దార్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జేసీ రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారుల వివరాలను పెండింగ్‌లో లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

హౌసింగ్ ఫర్ ఆల్ కింద ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ అంశాలపై వచ్చిన దరఖాస్తుల పెండెన్సీ, ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ, రీ సర్వే పురోగతి, కౌలు రైతులకు పంట సాగుదారు హక్కుల కార్డుల మంజూరు, నిత్యావసర సరుకుల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నిత్యావసర సరుకుల పంపిణీ ప్రక్రియ పటిష్టంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో సమావేశంలో ఎస్‌డీసీలు వరకుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఎస్ఓ పద్మశ్రీ, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి గౌస్ భాషా తదితర అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ ఆర్.గోపాలకృష్ణ, పక్కన డీఆర్ఓ

క్లుప్తంగా

సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి


నాగమల్లేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: గుంటూరు జిల్లా పొన్నూరులో ఇటీవల టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన మన్నవ సర్పంచ్ బోనిగల నాగమల్లేశ్వరరావును ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం పరామర్శించారు. గుంటూరులోని రమేష్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయన్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా ఆదుకుంటారని, పార్టీ నాయకుల అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పొన్నూరు ఇన్‌చార్జి అంబటి మురళి ఉన్నారు.

రొయ్య రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

- రొయ్య రైతుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి

ఒంగోలు సబర్బన్: రొయ్య రైతులకు యూనిట్‌కు రూ.1.50 విద్యుత్ ఇవ్వాలని రొయ్య రైతుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఒంగోలు కర్నూల్ రోడ్డులోని రొయ్యల రైతుల సంఘం కార్యాలయంలో మంగళవారం రొయ్యల రైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రొయ్యల రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తగ్గిన సోయా ధరలకు అనుగుణంగా ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 1800 మంది రొయ్యల రైతులు ఉంటే కేవలం 1000 మందికి మాత్రమే సబ్సిడీ అందుతుందన్నారు. మిగిలిన రైతులకు 10 ఎకరాలు ఉన్న కారణంగా, డీకేటీ భూముల్లో సాగు చేస్తున్న కారణంగా సబ్సిడీ విద్యుత్ అందడం లేదన్నారు. దీంతో రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు భారం పెరుగుతుందన్నారు. రొయ్యల ఫీడ్ తయారీలో అధికంగా వాడే సోయా ధరలు సగానికి సగం తగ్గాయని, కానీ ఫీడ్ ధరలు మాత్రం తగ్గించలేదన్నారు. గత నెలరోజుల కాలంలో బ్లాక్ టైగర్ రొయ్యలు ధరలను 40 కౌంట్, 30 కౌంట్‌లలో కేజీకి రూ.100 ధర తగ్గించారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఓ. సుబ్బారెడ్డి, సంఘం గౌరవ అధ్యక్షుడు పమిడి సుబ్బానాయుడు, ఉపాధ్యక్షుడు శింగంనేని అంజిబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

ఒంగోలు సబర్బన్: నగరంలోని సంతపేట విద్యుత్ భవన్‌లో ఈ నెల 17న విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఒంగోలు ఈఈ ఎం.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అదాలత్ జరుగుతుందన్నారు. అదాలత్‌లో సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్. విక్టర్ ఇమ్మానియేల్, ఫోరం సభ్యులు ఒంగోలు ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు, విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి మండలాల విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదులను రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. అదాలత్‌లో నమోదు చేసుకున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ఒంగోలు: చట్టాలపై అవగాహన కల్పించడం ప్రతి న్యాయ విద్యార్థి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో న్యాయ కళాశాల విద్యార్థులతో మంగళవారం లీగల్ లిటరసీ క్లబ్‌ను ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి న్యాయశాస్త్రం అభ్యసించే విద్యార్థి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమస్యల పరిష్కారం అనే అంశానికి సంబంధించిన ఐదు పరిష్కార విభాగాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన అవసరమని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారుల మధ్య వ్యాజ్యాలపై అవగాహన ఏవిధంగా కలిగించాలనే అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు మాట్లాడుతూ లీగల్ లిటరసీ క్లబ్ తమ కళాశాలలో ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ కె.నటరాజ్ కుమార్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంతో వేధిస్తున్నారు

- ఎస్పీకి పామూరు వీఓఏ ఫిర్యాదు

ఒంగోలు టౌన్: డ్వాక్రా గ్రూపు సభ్యుల డబ్బు దుర్వినియోగం చేసి పారిపోయినట్లు తనపై తప్పుడు ప్రచారం చేసి వేధిస్తున్నారని పామూరు మండలం వెలుగు వీఓఏ మంగళవారం ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం వెలుపల మీడియాకు వివరాలు వెల్లడించారు. సీసీ విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఎం విద్యాసాగర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే రూ.5 లక్షలు డిమాండ్ చేశారని, తనవద్ద అందుకు ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు.

గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను భ్రష్టుపట్టించేందుకు కంకణం కట్టుకున్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా వేగంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే సచివాలయ సేవలను సగానికి కుదించి, సర్వేల పేరుతో చెడుగుడు ఆడుకున్న సర్కారు.. తాజాగా బదిలీల మాటున ఏకంగా బంతాట ఆడుతోంది. జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జుల సిఫార్సు లేఖలను ప్రామాణికంగా తీసుకుని అడ్డగోలుగా బదిలీలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిఫార్సు బదిలీ.. వీఏఏలు బలి!



విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో మితిమీరిన రాజకీయ జోక్యం

సాక్షి నెట్‌వర్క్:

సచివాలయ ఉద్యోగులుగా ఎంపికైన వారు సొంత మండలంలోనే, సమీప గ్రామాల్లోనే విధులు నిర్వహించేలా అవకాశం కల్పిస్తామని ఆ వ్యవస్థ ప్రారంభ సమయంలోనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే నియామక ప్రక్రియ సాగింది. కానీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత సచివాలయ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడే నిర్ణయాలను వరుసగా తెరమీదకు తెస్తోంది. ఇటీవల మొదలైన బదిలీల ప్రక్రియ తమను మానసికంగా కుంగదీస్తోందని ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జుల రికమెండేషన్ ఉంటే కోరుకున్న చోట పోస్టింగ్
- సిఫార్సు లెటర్ లేదనే సాకుతో పక్క జిల్లాలకు గెంటేసిన వైనం
- బదిలీల్లో కిరికిరి.. సిఫార్సులతో రెండుసార్లు జాబితాలు విడుదల
- గ్రీవెన్స్, హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైన ఉద్యోగులు

దివ్యాంగులు, బాలింతలపైనా కూటమి సర్కారు కర్కశ ధోరణి

బదిలీల్లో దివ్యాంగులకు వెసులుబాటు కల్పించాలన్న నిబంధనలను రాజకీయ జోక్యంతో అధికారులు తుంగలో తొక్కారు. గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట మండలంలోని సలకలవీడులో పనిచేస్తున్న దివ్యాంగుడు టి.రమణారెడ్డికి మొదటి జాబితాలో కందులాపురం-2 పోస్టింగ్ ఇచ్చారు. రెండో జాబితాలో త్రిపురాంతకం మండలం విశ్వనాథపురం బదిలీ చేశారు. బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్లలో పనిచేస్తున్న కొండారెడ్డి టీడీపీ ఎమ్మెల్యే సిఫార్సుతో కందులాపురం-2కు చేరాడు.

☛ కంభం మండలం కందులూపురం-1లో పనిచేస్తున్న దివ్యాంగుడు బి.వెంకట రమేష్‌ను మొదట మార్కాపురం మండలం చింతకుంట బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండో జాబితాలో మాత్రం ఆయన పేరు చీమకుర్తి మండలం దేవరపాలేనికి మారింది.

☛ కంభం మండలంలోని చిన్నకంభం సచివాలయంలో పనిచేస్తున్న బి.ప్రగతిని మొదటి లిస్టులో హనుమంతునిపాడు మండలం తిమ్మారెడ్డిపల్లెకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు పేర్కొని, రెండో లిస్ట్‌లో ఏకంగా బాపట్ల జిల్లా సంతమాగులూరు వేశారు.

☛ గిద్దలూరు మండలంలోని కొమ్మునూరు సచివాలయంలో పనిచేస్తున్న చేరెడ్డి సుస్మితను శ్రీపొట్టిశ్రీరాములు జిల్లా కందుకూరుకు బదిలీ చేశారు. 9 నెలల బాబుతో వేరే జిల్లాకు వెళ్లి ఎలా పనిచేయాలని ఆమె తీవ్ర మనోవేదనకు గురవుతోంది.

బదిలీల్లో అన్యాయం చేశారు సార్..

త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెం రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.వెంకట ధనుశ్రీ బదిలీల కౌన్సెలింగ్‌లో యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో ఉన్న మూడు సచివాలయాలను కోరుకుంది. అయితే ఆమె కోరుకున్న గ్రామాలు కాకుండా యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలేనికి బదిలీ చేస్తున్నట్లు ఈ నెల 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు కూడా సిద్ధపడిన ఆమెను వెంకటాద్రిపాలెంలో జాయిన్ చేసుకోలేదు. ఈ నెల 5వ తేదీన మరో జాబితాను పాత తేదీ(జూన్ 21)తో విడుదల చేశారు. రెండో జాబితాలో ఏకంగా ఆమెను మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి సచివాలయానికి బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో మనోవేదనకు గురైన ఆమె గత సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు వెళ్లి అర్జీ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో 17 చోట్ల ఉందని, ఆయా ప్రాంతాలకు చెందిన నాయకుల సిఫార్సు లెటర్లు లేకపోవడం వలన కౌన్సెలింగ్ ప్రకారం కాకుండా ఖాళీ ఉన్న సచివాలయాలకు బదిలీ చేయాల్సి వచ్చిందని ఒక అధికారి చెప్పడం గమనార్హం. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 88 సచివాలయాలు ఉండగా అనేక మంది కూటమి నేత సిఫార్సు లెటర్‌తో అనుకూలమైన చోట పోస్టింగ్ దక్కించుకున్నారు.

చెప్పినట్టు వినలేదుగా.. మీ సంగతి ఇంతే..

మార్కాపురం నియోజకవర్గంలో 40 మంది వీఏఏలను బదిలీ చేశారు. వీరిలో సిఫార్సు లెటర్లు లేని వారిని నెల్లూరు, బాపట్ల జిల్లాలకు తరిమారు. తాము చెప్పినట్లు తలాడించలేదన్న ఆక్రోశంతో స్థానిక కూటమి నాయకులు వీఏఏల బదిలీల్లో చక్రం తిప్పినట్లు ఆరోపణలొస్తున్నాయి. సబ్సిడీపై అందించే విత్తనాలు, వ్యవసాయ పనిముట్లను తమ అనుచరులకే కట్టబెట్టాలని వీఏఏలపై కూటమి నాయకులు ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో నిబంధనల ప్రకారం నడుచుకున్న వీఏఏలను బదిలీల పేరుతో జిల్లా దాటించినట్లు తెలుస్తోంది. ఆరోగ్యం బాగోలేని తల్లిదండ్రులను వదిలిపెట్టలేక, భార్యాబిడ్డలతో కలిసి జిల్లా వదిలి వెళ్లలేక ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలో 96 మంది వీఏఏలు ఉండగా రేషనలైజేషన్ తర్వాత ఆ సంఖ్య 81కి తగ్గింది. వీరిలో పది శాతం మంది ఉద్యోగులను ఎమ్మెల్యే లెటర్ లేదన్న కారణంతో బాపట్ల ఏరియాకు బదిలీ చేశారు.

ఉద్యోగులకు రాజకీయ రంగు

దర్శి నియోజవకర్గంలో సచివాలయాల ఉద్యోగులు కొందరికి రాజకీయాలు ఆపాదించి బదిలీల పేరుతో వేధింపులకు తెరతీయడం చర్చనీయాంశమైంది. సిఫార్సు లేఖలు తెచ్చుకోనివారిలో కొందరిని బాపట్ల జిల్లాకు, మరికొందరిని యర్రగొండపాలెం మండలానికి బదిలీ చేయడం గమనార్హం. స్థానిక టీడీపీ నేతలు సిఫార్సు లేఖల పేరుతో చేతివాటం చూపినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముండ్లమూరు మండలంలో నియోజకవర్గ టీడీపీ నేత పేరు చెప్పి ఉద్యోగుల నుంచి రూ.15 వేలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

బాబు మోసాలు బయటపెడదాం

- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ శూన్యం
- కార్యకర్తలు అధైర్యపడొద్దు..2029లో మళ్లీ జెండా ఎగరేస్తాం
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున


బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

సంతనూతలపాడు: ప్రతి ఎన్నికల్లో అసాధ్యమైన హామీలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచాక వాటిని విస్మరించడం చంద్రబాబుకు అలవాటని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని చంద్రబాబు సక్రమంగా అమలు చేయలేదన్నారు. కానీ మన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి నెలా అర్హులకు నగదు జమైందన్నారు. 30 లక్షల ఇళ్లు, విద్య, ఆరోగ్య రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించారన్నారు. చంద్రబాబు పాలన అనుచరుల అభివృద్ధికే పరిమితమైందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో ఉందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించి అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల గుండెల్లోనే ఉన్నాయన్నారు. 2029లో పార్టీ జెండా ఎగరవేస్తామన్నారు. చంద్రబాబు మోసాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

టీడీపీపై ప్రజల్లో తిరుగుబాటు

ఏడాది కాలంలోనే అధికార టీడీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, త్వరలోనే తిరుగుబాటు తప్పదని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి తన హయాంలో నిజాయితీ రాజకీయాలు చేశారని, అందుకే ప్రజల్లో ఆయన ప్రతిష్ట రోజు రోజుకు పెరుగుతుందన్నారు. ఈ సమయంలో కష్టపడే ప్రతి ఒక్కరికి మంచి రోజులు వస్తాయన్నారు. జగన్ ప్రభంజనం మరోసారి చరిత్ర సృష్టిస్తుందన్నారు. సమావేశంలో మాజీ సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, సీనియర్ నాయకులు బొల్లినేని కృష్ణయ్య, అబ్బూరి శంకరరావు, గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి, మండల మహిళాధ్యక్షురాలు సీతమ్మ, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణా కోటిరెడ్డి, దమ్మల శ్రీనివాసరావు, ఏడుకొండలు, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, ఎంపీటీసీలు, సర్పంచులు దర్శి నాగమణి, శైలజ, వెంకటరెడ్డి, మున్సిపల్ విభాగం రావూరి శ్రీనివాసరెడ్డి, బలరాంరెడ్డి, వెంకటనారాయణ, వెంకట్రెడ్డి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో పంట ధ్వంసం

- కడుపున పుట్టిన బిడ్డలే శత్రువులుగా మారిన వైనం
- పత్తి పంటను ధ్వంసం చేసిన కుమార్తెలు


పీకేసిన పత్తి పంటలో యేరువ చిన్నక్క

పెద్దదోర్నాల: కుటుంబ కలహాలతో ఓ మహిళా రైతు వేసిన పత్తి పంటను కన్న కూతుర్లే ధ్వంసం చేసిన సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని కొత్తూరులో సోమవారం చోటు చేసుకోగా ఆలస్యంగా మంగళవారం వెలుగు చూసింది. ఈ సంఘటనతో సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది. బాధితురాలి కథనం మేరకు.. కొత్తూరుకు చెందిన రైతు యేరువ శ్రీనివాసరెడ్డి గతంలో పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి ఆయన భార్య చిన్నక్క అన్నీ తానై తన ముగ్గురు కుమార్తెలను పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేసింది. వారికి ఇవ్వాల్సిన లాంఛనాలు అన్నీ ఇచ్చి వారిని అత్తారిళ్లకు పంపారు. కూతుళ్లకు ఇచ్చింది పోగా, గ్రామంలో మిగిలిన రెండు ఎకరాల పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో తమ కుటుంబంలో ఆస్తి విషయమై తనకు, తన కూతుళ్లకు మధ్య విభేదాలు నెలకొన్నాయని, ఆస్తిని పంచి తమ వాటా తమకు రాసివ్వాలని కుమార్తెలు గొడవలు పడుతున్నారని చిన్నక్క ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తనతో గొడవ పెట్టుకున్న తన ఇద్దరు కుమార్తెలు వారి భర్తలతో కలిసి గ్రామంలో సాగు చేస్తున్న రెండెకరాల పత్తి పంటను మొదళ్లతో సహా పీకేసి ధ్వంసం చేసినట్లు ఆమె ఆరోపిస్తున్నారు. కడుపున పుట్టిన వాళ్లే తల్లిపై కసిని పెంచుకుని, చివరకు ఇలా నష్టాన్ని మిగిల్చారని ఆమె రోదిస్తోంది.

రౌండ్ రౌండ్‌కూ రైతుల ఘోష రీసౌండ్!

- 8వరౌండ్ ప్రారంభం నుంచి అధిక సంఖ్యలో బేళ్ల తిరస్కరణ
- ఏడో రౌండ్ వరకు నిత్యం 200 బేళ్లు తిరస్కరణ
- 8వ రౌండ్ ప్రారంభం నుంచి 300 బేళ్లకు పైగా తిరస్కరణ


కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఎనిమిదో రౌండ్ ప్రారంభం నుంచి బేళ్ల తిరస్కరణ సంఖ్య పెరిగిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడో రౌండ్ ప్రారంభమైన రోజు నుంచి రౌండ్ చివరి దశ సమయం వరకు రోజుకు దాదాపుగా 200పైగా బేళ్లు తిరస్కరణకు గురవుతూ వచ్చాయి. 8వ రౌండ్ ప్రారంభం నుంచి బేళ్ల తిరస్కరణ రోజుకు దాదాపు 300పైగా ఉన్నాయి. అసలే మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బేళ్ల తిరస్కరణతో ఖర్చు అధికమవుతుందని వాపోతున్నారు. అధికారులు పర్యటించి అన్ని బేళ్లను కొనుగోలు చేయాలని వ్యాపారస్తులకు సూచించినా వ్యాపారస్తులు అధికారుల మాటలను పట్టించుకోవట్లేదు. ఏడో రౌండ్ మధ్యలో రీజినల్ మేనేజర్ శీలం రామారావు పొగాకు వేలాన్ని పరిశీలించి అన్ని బేళ్లు కొనుగోలు చేయాలని వ్యాపారస్తులకు సూచించారు. ఆ సమయంలో వ్యాపారస్తులు అన్నీ బేళ్లను కొనుగోలు చేస్తామని చెప్పారు. కానీ ప్రతిరోజూ వందల బేళ్లను కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారు. గత సంవత్సరంలో కేజీ రూ.240 పలికిన లో గ్రేడ్ పొగాకును వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు వెనక్కి తీసుకుపోతున్నారు. మళ్లీ వాటిని తీసుకురావాలంటే వ్యయప్రయాసలకు లోను కావాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

326 బేళ్ల తిరస్కరణ

మంగళవారం జరిగిన వేలంలో 326 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కొండపి, పోలిరెడ్డి పాలెం, చౌటపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం గ్రామాల రైతులు 1091 బేళ్లను తీసుకురాగా 765 బేళ్లను కొనుగోలు చేసి 326 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160గా నమోదైంది. వేలంలో 23 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బైకుల దొంగలు.. బీటెక్ కుర్రోళ్లు!

అద్దంకి రూరల్: యూట్యూబ్ మంచే కాదు చెడూ చేస్తుందనడానికి బీటెక్ విద్యార్థులు దొంగలుగా మారిన ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. చెడు వ్యసనాలకు బానిసలై, సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశ వారిని కటకటాల్లోకి నెట్టింది. ఒంగోలులో బీటెక్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఒక ముఠాగా ఏర్పడి ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో బుల్లెట్ బైక్‌లను దొంగిలించారు. అద్దంకి సీఐ బృందం కేసును ఛేదించి దొంగలను పట్టుకుంది. ఈ సందర్భంగా చీరాల డీఎస్పీ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అద్దంకికి చెందిన పల్లా సాయిరాం.. పల్నాడు జిల్లా, రెంటచింతల మండలం, తుమ్మకోట గ్రామానికి చెందిన నార్లగడ్డ గోవిందరాజు.. నెల్లూరు జిల్లా, కావలి మండలం, చౌదరిపాలెం గ్రామానికి చెందిన కోడెల పవన్ కుమార్.. ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, యోడ్లూరి పాడు గ్రామానికి చెందిన దీవీ వేణుగోపాల్.. దర్శి మండలం, ఈస్ట్ వీరాయపాలెంకు చెందిన రాయపూడి వసంత్‌కుమార్.. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, కంచికచర్ల మండలం, కొత్త పెండ్యాల గ్రామానికి చెందిన జీనెపల్లి నరేంద్రవర్మ.. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం ఆల్లూరు గ్రామానికి చెందిన అక్కుల వెంకట సాయిరెడ్డి ఒంగోలులోని ఓ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. చెడు వ్యవసనాలకు బానిసైన వీరు సులువుగా డబ్బు సంపాదించే మార్గం చెప్పాలని నిందితుడు గోవిందరాజును సలహా అడిగారు. యూట్యూబ్‌లో సెర్చ్ చేసి బుల్లెట్ బైక్‌లు దొంగతనం చేసే విధానాన్ని అందరికీ చూపించాడు. బండిపై కూర్చుని ఒక కాలుతో హ్యాండిల్ తంతే లాక్ బ్రేక్ అవుతుంది. వైర్లు కట్ చేసి కలిపితే బండి స్టార్ట్ అవుతుంది. ఈ వీడియో చూసి దానిప్రకారం బుల్లెట్ బండ్లను మాత్రమే దొంగలించటం ప్రారంభించారు.

శింగరకొండ తిరునాళ్లలో మొదటి దొంగతనం

మొదటగా అద్దంకి మండలంలోని శింగరకొండ తిరునాళ్ల రోజు 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బుల్లెట్ బండిని దొంగిలించారు. ఇలా మొత్తం 16 బుల్లెట్‌లు, 1 స్కూటీ దొంగిలించారు. కొన్ని వాడుకుంటూ మిగిలినవి అమ్ముకుందామని అద్దంకి బ్రహ్మానందం కాలనీలోని పాడుపడ్డ బిల్డింగ్‌లో దాచిపెట్టారు. అద్దంకి పరిసర ప్రాంతాల్లో భారీగా బుల్లెట్ బైక్‌లు చోరికి గురికావటంతో ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు అద్దంకి సీఐ సుబ్బరాజు బృందం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగలను అరెస్టు చేసింది.